
సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 19 । జనవరి । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టాలకు బుధవారం 9,050 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు 2,650, సెంట్రల్ 1,800, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.



పాదగయ హుండీ ఆదాయం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో హుండీలను బుధవారం తెరిచారు. 133 రోజులకు రూ.31.26 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ సౌజన్య తెలిపారు.

జెడ్పీ బడ్జెట్‌కు పచ్చజెండా



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ బడ్జెట్‌ను జెడ్పీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కాకినాడలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జెడ్పీ స్థాయీ సంఘాలు, సర్వసభ్య సమావేశాలు ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన బుధవారం జరిగాయి.

8లో

న్యూస్‌రీల్

ఉగాది నాటికి లక్ష్యాలు పూర్తి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): నిర్దేశించిన లక్ష్యాలను ఉగాది నాటికి చేరుకోవాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్‌కుమార్‌లతో కలిసి మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 13,785 ఇళ్ల నిర్మాణం పూర్తయినందుకు అధికారులను ఆమె అభినందించారు. ఉగాది నాటికి 6,196 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల హాజరు శాతం ఇన్, అవుట్‌లో వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు. పౌర సేవల సామర్థ్యం పెంచుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుకవాగు అభివృద్ధికి నిధులు



కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ఇసుకవాగు అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.10 కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. దేవరపల్లిలోని అంబేడ్కర్ సెంటర్లో రూ.14.25 లక్షలతో కల్వర్టు, సీసీ డ్రెయిన్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు మైనింగ్ నిధులు రూ.1.10 కోట్లు, గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.8.25 లక్షలు, పంచాయతీ నిధులు రూ.6 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇసుకవాగు అభివృద్ధికి రూ.80 లక్షలు, వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వాగుపై కల్వర్టు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద కల్వర్టు నిర్మాణానికి రూ.8.25 లక్షలు, సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరు చేసినట్టు వివరించారు. ఎస్సీ శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీటీసీ సభ్యురాలు పల్లికొండ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల

కాకినాడ రూరల్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు సంబంధించి పురుష అభ్యర్థుల రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్రాజ్ సీఈఓ డీఎస్ సునీత తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రిక్రూట్‌మెంట్ కమాండింగ్ ఆఫీసరు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అగ్నిపథ్ పథకంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు(మెడికల్ అసిస్టెంట్) గ్రూపు – వై కేటగిరి ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్ బైపీసీలో 50 శాతం మార్కులు, ఫార్మసీ డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత అర్హత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు 1999 జూన్ 27 నుంచి 2004 జూన్ 27 మధ్య జన్మించి ఉండాలన్నారు. వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ పరిశీలించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 7, 8 తేదీలలో చెన్నైలోని తాంబరం ఎయిర్స్ ఫోర్స్ స్టేషన్‌లో రిక్రూట్‌మెంట్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి సెల్ నంబరు 93453 77868ను సంప్రదించాలన్నారు.

దివ్యాంగ బాలుడి వైద్యానికి కలెక్టర్ హామీ



దివ్యాంగ బాలుడితో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: గ్రామానికి చెందిన దివ్యాంగ బాలుడు వెలిశెట్టి చక్రపాణి వైద్యానికి కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా హామీ ఇచ్చారని ఎంపీపీ సుంకర శ్రీవల్లి బుధవారం తెలిపారు. చక్రపాణి పుట్టకతోనే మూగ, వినికిడి లోపంతో బాధపడుతున్నాడు. బాలుడికి వైద్యం చేయించడానికి కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సంప్రదించగా సుమారు రూ.6 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వం నుంచి రూ.5.30 లక్షలు మంజూరు చేయించారు. అయితే బాలుడి వైద్యానికి మరో రూ.3 లక్షలు వరకు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. సమస్యను బుధవారం కాకినాడలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా దృష్టికి తీసుకువెళ్లగా బాలుడి వైద్యానికి ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు పాల్గొన్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆదాయం

2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ
రూ.629.84 కోట్లు

2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ
రూ.701.84 కోట్లు

తనఖా.. ఆదాయంలో తడాఖా



- ఊపిరి పీల్చుకున్న రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆదాయార్జనలో మెరుగైన పరిస్థితి
- కోవిడ్‌తో పెరిగిన తనఖా రిజిస్ట్రేషన్లు
- ఫలితంగా లక్ష్య సాధన దిశగా అడుగులు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం మెరుగుపడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో (గత ఏడాది డిసెంబర్ వరకూ) రూ.701.84 కోట్ల ఆదాయం సమకూరింది. అంతకు ముందు అంటే 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంతో పోలిస్తే ఆదాయంలో రూ.72 కోట్ల వృద్ధి కనిపిస్తోంది. ఒక్క తూర్పు గోదావరి జిల్లా రిజిస్ట్రార్ పరిధిలోనే అత్యధికంగా 84.46 శాతం మేర లక్ష్యం సాధించారు. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పరిధి లక్ష్యంలో 76.32 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 80.72 శాతం మేర ఆదాయం సాధించారు. ఆదాయంలో సగం పెరుగుదలకు తనఖా రిజిస్ట్రేషన్లే కారణమని ఆ శాఖ అధికార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఊపందుకున్న రియల్ ఎస్టేట్

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు భూముల కొనుగోళ్లు, అమ్మకాల ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుంది. ఏవైనా క్రయ విక్రయాలతో పాటు, వివిధ రకాల రిజిస్ట్రేషన్ల వల్ల స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు వంటి రూపాల్లో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుండటం, భూముల క్రయవిక్రయాలు పెరగడంతో ఆదాయంలో గణనీయ పెరుగుదల కనిపించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తరువాత నుంచి అన్ని లావాదేవీలూ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. దీనికి తోడు కోవిడ్ ప్రభావం కూడా రిజిస్ట్రేషన్ల శాఖపై పడింది. కరోనా వైరస్ ప్రభావమున్న కాలంలో చాలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనుకున్న రీతిలో ఆదాయం రాలేదు. గడచిన మూడేళ్లతో పోలిస్తే స్థిరాస్తి రంగం ఇప్పుడు కాస్త ఊపందుకుంది. ఇటీవల నాన్ లే అవుట్ స్థలాల రిజిస్ట్రేషన్ చేయకూడదనే ఆదేశాలు రావడంతో ఆదాయం అంతంత మాత్రంగా వచ్చింది.

తనఖా రిజిస్ట్రేషన్లలో పెరుగుదల

తూర్పు గోదావరి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 12, కాకినాడ జిల్లా పరిధిలో 9, కోనసీమలో 15 చొప్పున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు.. ఇలా వేటినైనా సరే కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్ శాఖ అనుమతి అవసరం. ఇటీవల తనఖా రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వంద రిజిస్ట్రేషన్లు వస్తే సగం ఇవే ఉంటున్నాయని సమాచారం. కోవిడ్ కారణంగా బయట అప్పులు ఇచ్చే వాళ్లు వెనుకంజ వేయడంతో చేసేది లేక అప్పులు, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి చాలామంది బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలకు వెళ్లి స్థిరాస్తులను కుదువ పెట్టారు. తప్పనిసరి పరిస్థితుల్లో రుణాలు తీసుకున్నారు. గతంలో ఇవి ఆస్తులకు సంబంధించిన పత్రాలు తీసుకుని రుణాలు మంజూరు చేసేవి. ప్రస్తుతం అన్ని సంస్థలూ తనఖా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశాయి. కోవిడ్‌తో అన్ని వర్గాలూ ఆర్థికంగా దెబ్బ తినడంతో ముందుముందు ఇబ్బందులు తలెత్తకుండా ఆస్తులను కుదువ పెట్టుకుని తనఖా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాయి. తరువాతే అప్పు ఇస్తున్నాయి. దీంతో సేల్ డీడ్‌లు, వివిధ రకాల రిజిస్ట్రేషన్లతో పాటు తనఖా రిజిస్ట్రేషన్లు కూడా పెరుగుతున్నాయి.

కొన్ని లక్ష్యాన్ని దాటాయి



2021తో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో గడచిన డిసెంబర్ నాటికి ఆదాయం ఓ మోస్తరుగా పెరిగింది. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇప్పటికే లక్ష్యాన్ని దాటాయి. కొన్ని వెనుకబడ్డాయి. వెనుకబడిన కార్యాలయాలకు మార్గదర్శకాలు ఇస్తున్నాం. గ్రామ సచివాలయాలతో పాటు ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్ కూడా అందుబాటులోకి వస్తే రిజిస్ట్రేషన్లు వేగవంతంగా జరుగుతాయి. ప్రజలకు శాఖాపరంగా అందించే సేవల్లో జాప్యం లేకుండా కృషి చేస్తున్నాం.

– ఎ.నాగలక్ష్మి,
డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)



సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు

విప్లవాత్మక మార్పునకు నాంది పలికిన గ్రామ సచివాలయాల్లోనే ప్రభుత్వం అందించే సేవలన్నింటినీ అందుబాటులోకి తీసుకురావాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. ఇప్పటికే ఉన్న ఊళ్లోనే పలు సేవలు పొందుతున్న ప్రజలకు చేరువగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. గత ఏడాది ఫిబ్రవరిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఆరు సచివాలయాల్లో ప్రయోగాత్మకంగా స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రారంభించింది. రెండో విడతలో కాకినాడ జిల్లాలో 113, తూర్పు గోదావరి జిల్లాలో 47, కోనసీమ జిల్లాలో 51 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించింది. ఇవి త్వరలో ప్రారంభం కానున్నాయి.

రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వచ్చిన సచివాలయాలు

- కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం సిరివాడ, పిఠాపురం మండలం ఇల్లింద్రాడ.
- కోనసీమ జిల్లా అమలాపురం మండలం పాలగుమ్మి, రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లి.
- తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం, కొవ్వూరు మండలం తోగుమ్మి.

మహిళా కమిటీని పునరుత్తేజితం చేస్తాం

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మహిళల అభ్యున్నతే లక్ష్యంగా రాజమహేంద్రవరం మహిళా కమిటీని పునరుత్తేజితం చేస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం మహిళా కమిటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.రమణా చౌదరి (రమణమ్మ) ప్రథమ వర్ధంతి సభలో వాసిరెడ్డి పద్మ పాల్గొన్నారు. రమణా చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో అన్ని రాజకీయ పార్టీలలోని ప్రముఖులతో కలసి రాజమహేంద్రవరం మహిళా కమిటీ ఏర్పడిందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి జిల్లాలో కమిటీలు ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ, ప్రాంతం, వర్గం, కులం అనే తేడా లేకుండా ప్రతి సమస్యపై స్పందించి పరిష్కారానికి కృషి చేస్తేనే మహిళా లోకానికి అండగా ఉండగలుగుతామన్నారు. ఇతర పట్టణాలు, జిల్లాలు కూడా రాజమహేంద్రవరం మహిళా కమిటీని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కమిటీ ఓ చరిత్ర సృష్టించిందని అన్నారు. రమణా చౌదరి నగర మహిళా కమిటీని స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా మహిళల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆమె సేవలు పునరంకితమయ్యే విధంగా ఈ కమిటీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సభ్యులతో కలసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రమణా చౌదరి కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు శారదాదేవి, కె.విజయలక్ష్మి, పి.లక్ష్మీ శ్రీనివాస్, గ్రంధి లలిత, జి.శారద తదితరులు ఉన్నారు.



రమణా చౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాసిరెడ్డి పద్మ తదితరులు

తీరాన ఆర్మీ, నేవీ సాహస విన్యాసాలు

- భారీగా చేరుకున్న సైనికులు
- ఐదు రోజుల పాటు హడావుడి

కాకినాడ రూరల్: ఆకాశం, నేల, జలమార్గాలో ఎటు నుంచి శత్రుసైన్యం చొరబడినా కట్టడి చేసేందుకు మన సైన్యం సన్నద్ధంగా ఉంది. ఏ క్షణంలో దాడి జరిగినా ఎదుర్కొని సత్తా చాటగలమని నిరూపిస్తున్నాయి. కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో ఇండియన్ ఆర్మీ, నేవీకి చెందిన బలగాలు బుధవారం సాయంత్రం నుంచి ఇందుకు సంబంధించిన విన్యాసాలను కళ్లకు కడుతున్నాయి. ఐదు రోజుల పాటు జరగనున్న ఆర్మీ, నేవీ ఆంఫీబీయస్ కసరత్తుకు కాకినాడ తీరంలోని నేవల్ ఎన్‌క్లేవ్‌తో పాటు హోప్ ఐలాండ్ వేదికగా నిలిచింది. శత్రు సైన్యాన్ని కదన రంగంలో తుదముట్టించడమే లక్ష్యంగా చేపట్టనున్న మన సైనికుల విన్యాసాలు ఒళ్లు జలదరింపజేయనున్నాయి. భద్రతాపరమైన కారణాలు దృష్ట్యా వీటిని తిలకించేందుకు ప్రజలకు అనుమతి లేదు. ఇందుకోసం ఇప్పటికే కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డును మూసివేశారు. నేవల్ ఎన్‌క్లేవ్ నుంచి బీచ్ వరకు గల ప్రాంతాన్ని సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. చెన్నై నుంచి ఆర్మీ, విశాఖ పట్నం నుంచి తూర్పు నౌకాదళ సిబ్బంది వాహనాలలో తరలివచ్చారు. బీచ్ మార్గమంతా ఆర్మీ, నేవీ ట్రక్కులు, గుడారాలు దర్శనమిస్తున్నాయి. మరో వైపు నేవీ హెలికాఫ్టర్లు గాలిలో చక్కర్లు కొడుతున్నాయి. కాకినాడ తీరానికి యుద్ధ నౌకలు చేరుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో కాకినాడ డీఎస్పీ మురళీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం, రూరల్ సర్కిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో నేవీ ట్రక్కులు



బీచ్‌లో ఆర్మీ, నేవీ విన్యాసాలకు వచ్చిన సైనికులు ఏర్పాటు చేసుకున్న గుడారాలు. చిత్రంలో సైనికులు

భక్తిశ్రద్ధలతో గౌరీ శంకరుల రథోత్సవం





శ్రీరంగపట్నంలో గౌరీదేవి రథోత్సవంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్. (అంతరచిత్రం) రథోత్సవంలో భక్తులు

- ఉత్సవాలు సంస్కృతికి నిలయాలు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గౌరీ శంకరుల ఉత్సవాలు సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం శ్రీరంగపట్నంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో అనేక తరాలుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అక్టోబర్ నుంచి జనవరి 18వ తేదీ వరకూ నిర్వహించిన ఉత్సవాలతో పండగ వాతావరణం నెలకొందన్నారు. ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో రథోత్సవం నిర్వహించడం ఇక్కడి ప్రజల ఆధ్యాత్మికతను చాటుతుందన్నారు. సంస్కృతీ సంప్రదాయాలకు పల్లెలు పట్టుగొమ్మలని, గౌరీ శంకరుల ఉత్సవాలకు రావడం సంతృప్తిగా ఉందన్నారు. అక్టోబర్‌లో పుట్టింటికి వచ్చిన గౌరీదేవిని పట్టు చీరలు, సారెతో సంప్రదాయబద్ధంగా అత్తారింటికి సాగనంపారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారితో పాటు సారెతో ప్రధాన వీధుల నుంచి సాగారు. రథంపై ఆశీనులైన గౌరీ శంకరులను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఇదిలా ఉంటే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రధాన కూడళ్లలో ఐదు స్టేజీలను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. రమణ బృందంచే పల్సర్ బైక్ నృత్యం, గౌరీ శంకరుల భక్తిరంజని ఆర్కెస్ట్రా, విజయదుర్గ నాట్య మండలిచే సత్యహరిశ్చంద్ర నాటిక, యువకుల డ్యాన్స్ ప్రదర్శనలు అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్చరీలో చిచ్చర పిడుగు జేష్ణ

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): చిన్నారి వర్రే జేష్ణ జాతీయ ఆర్చరీ అండర్–9 విభాగంలో పతకాలు సాధించి స్ఫూర్తిగా నిలిచిందని కలెక్టర్ మాధవీలత ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ మాధవీలతను కలిసి బాలిక కలిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తే ఏదైనా సాధించవచ్చు అనడానికి జేష్ణ ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన ఆర్చరీ పోటీల్లో మూడు రజతాలు, ఒక కాంస్యం సాధించి అబ్బురపరిచిందన్నారు. ఇటీవల ఇస్కాన్ టెంపుల్ వద్ద జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మాధవీలత ప్రసంగం విని తాను ప్రేరణ పొందినట్లు జేష్ణ పేర్కొంది. కోచ్ నాళం రామ్‌కుమార్, జేష్ణ తండ్రి ఈశ్వర్ ప్రభాకర్‌లను కలెక్టర్ అభినందించారు.



చిన్నారి జేష్ణను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

భూసమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే



పెరవలిలో డ్రోన్ ఎగరవేస్తున్న జిల్లా కలెక్టర్ కె.మాధవీలత

జిల్లా కలెక్టర్ మాధవీలత

పెరవలి: ల్యాండ్ పార్శిల్ మ్యాప్ ద్వారా భూ రికార్డులకు శాశ్వత హక్కు నిర్ధారించేందుకు రీసర్వే ప్రక్రియ చేపట్టామని కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. పెరవలిలో బుధవారం ఉదయం జగనన్న భూ హక్కు ..భూరక్ష డ్రోన్ రీసర్వే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 100 ఏళ్ల క్రితం భూములకు సర్వే చేశారన్నారు. మళ్లీ ఇన్నాళ్లకు రీ సర్వే ప్రక్రియ చేపట్టారన్నారు. అప్పటి నుంచి పలు లావాదేవీలు, మ్యూటేషన్స్ జరిగాయన్నారు. ఫలితంగా రికార్డుల్లో పలు సందేహాలకు అవకాశమేర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో వీటికి పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీసర్వేకు ఆదేశించారన్నారు. పూర్తి పారదర్శకతతో సర్వే ప్రక్రియ చేపట్టామన్నారు. అందువల్ల శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 97 గ్రామాల్లో 851.76 స్క్వేర్ మీటర్ల మేర సర్వే పూర్తయిందని కలెక్టర్ పేర్కొన్నారు. మార్చి నెలాఖరు నాటికి సర్వే పూర్తి చేస్తామన్నారు. పక్కా ప్రణాళిక ప్రకారం ఇందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ యజమానులు, రైతులు సహకరించాలన్నారు. కొలతలు, హద్దులు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. రీ సర్వే తర్వాత ఎల్‌పీఎం పత్రం జారీ చేస్తారన్నారు. పూర్వీకుల ఆస్తులకు కూడా రీసర్వేలో పత్రాలు అంజేస్తామని వివరించారు. జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి లక్ష్మణరావు, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీఓ రమేష్, ఈఓపీఆర్డీ నర్శింహమూర్తి పాల్గొన్నారు.

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రహదారి భద్రత వారోత్సవాల ద్వారా వాహన చోదకులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ మాధవీలత సూచించారు. బుధవారం సాయంత్రం తమ చాంబర్‌లో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ 'యువశక్తితోనే మార్పు' అనే నినాదంతో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను ఈనెల 18 నుంచి 24 వరకు నిర్వహిస్తారన్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేశారు. డీటీసీ కె.ఎస్ ఎంపీ కృష్ణారావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రంగనాయకులు, సంపత్, రామ్‌నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తుపాకీతో తిరుగుతున్న వ్యక్తి అరెస్టు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలో తుపాకీతో తిరుగుతున్న వ్యక్తిని స్థానిక ఒకటో పట్టణ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కొత్తపేటకు చెందిన కెల్లా సత్యనారాయణ జాంపేటలో కోడిగుడ్ల వ్యాపారం చేస్తుంటాడు. అతని బావ బొత్స మోహన్ విజయనగరంలో నివాసం ఉంటున్నాడు. కాగా నగరంలో ప్రజలను తుపాకీతో బెదిరించి డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో సత్యనారాయణ తన బావ మోహన్ వద్ద నుంచి 9 ఎమ్ఎమ్ యూకే మేడ్ పిస్టల్‌ను తెచ్చాడు. దాన్ని ట్రైల్ వేసేందుకు తన ఇంటి పక్కనున్న ఆటోడ్రైవర్ అంబల్ల హరి సూర్య అనే వ్యక్తితో బుధవారం నగరంలోని అన్నపూర్ణమ్మపేట సమీపంలో తిరుగుతున్నాడు. అయితే ఈ ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కెల్లా సత్యనారాయణ వద్ద తుపాకీ కనిపించింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నున్న పిస్టల్‌ను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

దేవరపల్లి: మద్యం మత్తులో ఉరి వేసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కె. శ్రీహరి రావు కథనం ప్రకారం.. దేవరపల్లి చంద్రబాబు కాలనీకి చెందిన తుపాకుల ఆదినారాయణ (57) మద్యానికి బానిసయ్యాడు. గతంలో భార్యను కొట్టి జైలుకు వెళ్లి వచ్చాడు. అప్పటి నుంచీ ఇంటి చుట్టుపక్కల వారిని తిడుతూ రోజూ గొడవ పడుతున్నాడు. రెండు నెలల క్రితం భార్యతో గొడవ పడగా ఆమె హైదరాబాద్ వెళ్లిపోయింది. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంటి వెనుక ఉంటున్న మహిళ సింహాద్రి లక్ష్మితో గొడవ పడ్డాడు. ఆమె కేసు పెడతానని హెచ్చరించగా.. చుట్టుపక్కల వారు ఆదినారాయణకు నచ్చజెప్పి పంపించారు. బుధవారం ఉదయం చుట్టుపక్కల వారిని తిడుతూ, నా మీద కేసు పెడతారా? అంటూ కేకలు వేసి ఇంటి వద్ద ఉన్న గ్రిల్‌కు తల కొట్టుకుని మద్యం మత్తులో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-కేవైసీపై ఆందోళన వద్దు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ-కేవైసీపై కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఆందోళన చెందవద్దని జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు తమ ఆధార్ నంబరును ఈ నెల 20లోగా ఈ-కేవైసీతో అనుసంధానం చేసుకోవాలంటూ ఈ నెల 11న జీఓఎంఎస్207 ఇచ్చారని పేర్కొన్నారు. దీనిపై పెన్షనర్లు ఆందోళన చెందడంతో సంఘం కార్యదర్శి శాస్త్రి, కోశాధికారి ఇబ్రహీం, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి డీటీఓకు వినతిపత్రం అందించామని తెలిపారు.

జెడ్పీ బడ్జెట్‌కు పచ్చజెండా

- వచ్చే ఆర్థిక సంవత్సరం ఆదాయం అంచనా రూ.1,379 కోట్లు
- వ్యయం రూ.1,378.30
- మిగులు రూ.70 లక్షలు
- సర్వసభ్య సమావేశం ఆమోదం



'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ వంగా గీత, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ బడ్జెట్‌ను జెడ్పీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కాకినాడలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జెడ్పీ స్థాయీ సంఘాలు, సర్వసభ్య సమావేశాలు చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన బుధవారం జరిగాయి. 2022–23 బడ్జెట్ సవరణలను, 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలను జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) ఎన్‌వీవీ సత్యనారాయణ పద్దుల వారీగా సభ్యులకు వివరించారు. సొంత వనరుల ద్వారా ఆదాయం, వ్యయాలను విశదీకరించారు. 2022–23 సవరణ బడ్జెట్, 2023–24 బడ్జెట్ అంచనాలకు సమావేశం ఆమోదం తెలిపింది. అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వైద్య, ఆరోగ్యం, రహదారులు, భవనాలు, ఇరిగేషన్, గృహ నిర్మాణం, విద్య తదితర శాఖల పరిధిలో ప్రస్తుత కార్యకలాపాలు, వివిధ పథకాలు, కార్యక్రమాల అమలులో ప్రగతిపై సర్వసభ్య సమావేశంలో చర్చించారు. పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశాలు, మన బడి నాడు – నేడు పనులు, నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు, రోడ్ల ఆధునీకరణ తదితర అంశాలపై సభ్యుల సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. తొలుత యు.కొత్తపల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎన్‌వీఎస్ రామారావు మృతికి ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళి అర్పించారు. అనంతరం 'జగనన్న విద్యా భారతి' పేరుతో పదో తరగతి విద్యార్థులకు జెడ్పీ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కొంతమంది విద్యార్థులకు లాంఛనంగా పంపిణీ చేశారు.

సమావేశాలు ఫలప్రదం

సమావేశం అనంతరం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ, స్థాయీ సంఘాల, సర్వసభ్య సమావేశాలు ఫలప్రదంగా జరిగాయని అన్నారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వివిధ శాఖల అధికారులు పాల్గొని సభ్యుల సందేహాలను నివృత్తి చేశారని చెప్పారు. విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని, దీనికి అనుగుణంగా పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు జెడ్పీ ఆధ్వర్యంలో 'జగనన్న విద్యా భారతి' పేరిట ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ రూపొందించామని చెప్పారు. దీనిని జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేస్తామని అన్నారు. మూడు నెలలకోసారి జెడ్పీలో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జెడ్పీటీసీ సభ్యులకు ప్రొటోకాల్ వర్తింపజేస్తామని విప్పర్తి తెలిపారు.

కాకినాడ, కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, జెడ్పీ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ వంగా గీత, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, కాకినాడ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జెడ్పీ వైస్ చైర్మన్లు బి.అనుబాబు, ఎం.పద్మలత, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, రాపాక వరప్రసాదరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు బీవీ రమణ, జె.సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ వివరాలివీ..

- సాధారణ నిధులు, వివిధ గ్రాంట్లతో పాటు, వివిధ విభాగాలకు విడుదలయ్యే నిధులు కలిపి 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షల మిగులుతో బడ్జెట్‌ను సీఈఓ సత్యనారాయణ ప్రవేశపెట్టారు.
- అన్ని పద్దులూ కలిపి ఆదాయం రూ.1,379 కోట్లు, వ్యయం రూ.1378.30 కోట్లుగా అంచనా వేశారు.
- అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ కింద ఆదాయం రూ.1,229.43 కోట్లు కాగా.. వ్యయం రూ.1,228.78 కోట్లుగా పేర్కొన్నారు.

మడ అడవుల సంరక్షణపై రేపు అవగాహన సదస్సు

కాకినాడ సిటీ/తాళ్లరేవు: ఏపీ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యాన 'మడ అడవుల సంరక్షణ – సామాజిక బాధ్యత – మీడియా పాత్ర', 'జర్నలిజం మౌలిక సూత్రాలు, విలువలు' అనే అంశాలపై తాళ్లరేవు మండలం కోరంగి ఫారెస్టు కాంప్లెక్స్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ప్రెస్ అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎం.నాగార్జున బుధవారం వేర్వేరు ప్రకటనల్లో ఈ విషయం తెలిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు (కాకినాడ రూరల్), ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి (కాకినాడ సిటీ), గొల్లపల్లి శ్రీనివాస అశోక్ (యానాం), జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు, జిల్లా అటవీ అధికారి ఇందుకూరి కాశీవిశ్వనాథరాజు పాల్గొంటారని వివరించారు. ఈ సదస్సుకు పర్యావరణవేత్తలు, పర్యావరణ పరిరక్షకులు హాజరు కావాలని కోరారు.

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం రాత్రి 8 గంటలకు కాకినాడ చేరుకుని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు చొల్లంగి టూరిస్ట్ స్పాట్ ఫెర్రీ పాయింట్‌ను సందర్శిస్తారు. అనంతరం కోరంగి ఫారెస్టు కాంప్లెక్స్‌లో జరిగే సదస్సులో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకొని 4 గంటలకు విజయవాడ పయనమవుతారు.

ముగిసిన సంక్రాంతి సెలవులు

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

రాయవరం: సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. ఈ నెల 12 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. వారం రోజుల అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 5,848 పాఠశాలల్లోని 7.42 లక్షల మంది విద్యార్థులు నేటి నుంచి పాఠశాలలకు హాజరు కానున్నారు. ఉపాధ్యాయులు కూడా బడి బాట పట్టనున్నారు. సంక్రాంతి సెలవులకు ముందు ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకూ సమ్మేటివ్–1 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష పత్రాల మూల్యాంకనం చేసి, విద్యార్థులకు ఆన్సర్ షీట్లు ఇవ్వాలని ఇప్పటికే విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు మూల్యాంకన పత్రాలు అందజేయాల్సి ఉంటుంది. ప్రశ్నపత్రాల జవాబులను ఉపాధ్యాయులు బోర్డుపై రాయాలి. దీనివలన రాసిన జవాబులను విద్యార్థులు సరి చేసుకునే అవకాశముంటుందన్నది అధికారుల ఉద్దేశం. మూల్యాంకన పత్రాలను విద్యార్థులకు ఇచ్చి, వారి తల్లిదండ్రులతో ఆన్సర్ షీట్లపై సంతకం చేయించాల్సి ఉంటుంది. అలాగే ఎస్ఏ–1 పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. అధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు సెల్ఫీ దిగి, ఆ ఫొటోలను ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. దీని వలన విద్యార్థుల్లో పోటీతత్వం పెరగడమే కాకుండా, మరింత బాగా రాణించాలనే కోరిక కలిగించినట్లవుతుందన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఎఫ్ఏ–2 పరీక్షల్లో ఉపాధ్యాయులు ఈ విధానాన్ని అమలు చేశారు. కాగా, జూనియర్ కళాశాలలు బుధవారమే పునఃప్రారంభమయ్యాయి.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకుడు బాలాజీ తదితరులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం పీఠం కల్యాణ శోభను సంతరించుకుంది. వేడుకల రెండో రోజున విజయదుర్గా అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు దుర్గాష్టోత్తర, సహస్ర నామావళి, దుర్గా ద్వాత్రింశతి నామావళి, దేవీ శక్తిమాల అష్టోత్తరాలతో అమ్మవారిని పూజించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠానికి తిరుమల తిరుపతి దేవస్థానం అందజేసిన శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. పీఠం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవ విగ్రహాలకు పీఠాధిపతి గాడ్ సమక్షంలో శ్రీనివాస మంగాపురం దేవాలయ ప్రధానార్చకుడు బాలాజీ ఆధ్వర్యాన వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. తులసి దళాలతో అర్చించారు. అనంతరం తిరుమల వైఖానస పండితులతో శ్రీవారి దివ్య కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి, తన్మయులయ్యారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి రీజినల్ కో ఆర్డినేటర్ కందర్ప హనుమాన్ తదితరులు పాల్గొన్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్ఓ వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ) ఆధ్వర్యాన భక్తులకు ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు.

నేడు 'గాడ్' జన్మదిన వేడుకలు

గాడ్ 87వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు కమిటీ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ వేడుకల్లో టీటీడీ శ్రీవారి సన్నిధి ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు, పలువురు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు, సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక ప్రముఖులు పాల్గొంటారని పీఠం పీఆర్ఓ బాబీ తెలిపారు.

పథకాల ప్రయోజనాలు లక్షిత వర్గాలకు అందాలి

- కాకినాడ ఎంపీ వంగా గీత
- జెడ్పీలో దిశ సమావేశం

కాకినాడ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల సమన్వయంతో జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు లక్షిత వర్గాలకు అందేలా కృషి చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కాకినాడ ఎంపీ వంగా గీత కోరారు. పూర్వపు తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఎంపీ వంగా గీత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ ఆరోగ్య మిషన్, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్, జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్, మధ్యాహ్న భోజన పథకం, స్మార్ట్ సిటీ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జాతీయ ఆహార భద్రత పథకాల అమలు తీరును సమీక్షించారు. జల్‌జీవన్ మిషన్ కింద ఉమ్మడి జిల్లాలోని 385 ఆవాసాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేయాలన్న లక్ష్యాన్ని 2024 నాటికి సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులను సభ్యులు ఆదేశించారు. ముఖ్యంగా గ్రామ శివార్లలోని ఉండే బడుగు వర్గాల కాలనీలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందేందుకు ప్రత్యేక పైపు లైన్లు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఎంపీ గీత ఆదేశించారు. సముద్ర తీర గ్రామాల్లో ఉప్పునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు కోరారు. జాతీయ ఆరోగ్య మిషన్‌పై జరిగిన చర్చలో పలువురు ఎంపీపీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు మాట్లాడారు. నిర్మాణం పూర్తయిన ఆస్పత్రి భవనాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి, వెంటనే ప్రారంభించి ప్రజలకు ఆరోగ్య సేవలు విస్తరించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, క్రమం తప్పకుండా ఆస్పత్రి అడ్వైజరీ కమిటీ సమావేశాలు నిర్వహించాలని కోరారు. వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ అంశాన్ని ప్రభుత్వ ఆమోదానికి ప్రతిపాదించామని, పూర్తయిన ఆస్పత్రి భవనాలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మెట్ట మండలాల్లో తరచూ వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, వీటిని జాప్యం లేకుండా పునరుద్ధరించాలని, ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను, చేతికి అందేలా ఉన్న ఫ్యూజ్ బాక్సులను చక్కదిద్దాలని ఎంపీపీలు కోరారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఏజెన్సీలు సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలు నాణ్యత, రుచి లేక, తినడానికి విద్యార్థులు విముఖత చూపుతున్న చోట.. వనరులుంటే అదే స్కూలులో వండి వడ్డించేందుకు అనుమతించాలని సభ్యులు కోరారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా కంది పప్పు, పంచదార పంపిణీ చేయాలని కోరారు. తరచుగా ఫుడ్ కమిటీ సమావేశాలు నిర్వహించి, పంపిణీ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ గన్నికి జీవన సాఫల్య పురస్కారం



జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు లోక్‌నాయక్ ఫౌండేషన్ బుధవారం సాయంత్రం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసింది. విశాఖపట్నం సిరిపురం వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ పురస్కారం అందజేశారు. సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, నటీమణులు జయసుధ, జయప్రద తదితరులు కూడా పాల్గొన్నారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు కోనసీమ క్రీడాకారులు



అంతర్జాతీయ టోర్నీలో పాల్గొంటున్న కోనసీమ క్రీడాకారులు

అమలాపురం రూరల్: ఢిల్లీలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకూ జరిగే ఇండియా ఓపెన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కోనసీమ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ టోర్నీలో అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఆడుతూండగా.. పాయసం శ్రీనివాసరావు గొల్లకోటి శ్రీనివాసరావు టెక్నికల్ అఫీషియల్స్‌గా ఎంపికయ్యారు. ఈ టోర్నీలో మన దేశానికి చెందిన సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి, కిడాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్, ప్రణయ్, పీవీ సింధు, సైనా నెహ్వాల్, స్పెయిన్ క్రీడాకారిణి కరోలినా మారినా తదితర అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొంటున్నారు. జిల్లా నుంచి అంతర్జాతీయ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులను ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇంద్రవందిత్, కార్యదర్శి కొత్తపల్లి బాలు, రంకిరెడ్డి కాశీ తదితరులు అభినందించారు.

బీరువా తాళాలు పగులగొట్టి చోరీ

గండేపల్లి: బీరువా తాళాలు పగులగొట్టి చోరీ దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. గండేపల్లికి చెందిన మామిడిపాక కల్యాణ్ శ్రీనివాస్ మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వెళ్లారు. అదే రోజు అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి, బీరువా తాళాలు పగులగొట్టారు. సుమారు ఐదున్నర కేజీల వెండి, నాలుగు గ్రాముల బంగారు వస్తువులు, రూ.30 వేల నగదు అపహరించారు. చోరీ అయిన సొత్తు విలువ రూ.1.40 లక్షలుంటుందని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని క్లూస్ టీము పరిశీలించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆవిరైన సంక్రాంతి సంతోషం

- మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- బాలుడి దుర్మరణం
- అతడి తల్లిదండ్రులకు, తమ్ముడికి తీవ్ర గాయాలు
- అన్నవరం వద్ద ప్రమాదం



రోడ్డుపై దుర్గాప్రసాద్ మృతదేహం



తుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణ, దుర్గ, గంగరాజు

అన్నవరం: సంక్రాంతి పండగకు బంధువుల ఇంటికి వెళ్లి.. సరదాగా గడిపి.. తిరిగి స్వగ్రామం వస్తున్న ఒక కుటుంబానికి ఊహించని విధంగా తీవ్ర విషాదం ఎదురైంది. వివరాల్లోకి వెళ్తే.. రౌతులపూడి మండలం ధార జగన్నాథపురానికి చెందిన బర్ల రమణ కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండగకు అత్తవారి ఊరు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం అక్కడ భోజనం అనంతరం భార్య దుర్గ, పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ (6), చిన్న కుమారుడు గంగరాజుతో కలిసి రమణ మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి తిరుగుపయనమయ్యాడు. అన్నవరం స్నేహ రెసిడెన్సీ వద్దకు చేరుకునేసరికి వీరి బైక్‌ను విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణ పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. రమణ, దుర్గ, గంగరాజు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అన్నవరం ఎస్సై శోభన్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పెరవలి: కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న మండలంలోని ఖండవల్లికి చెందిన కంతేటి దుర్గా మల్లేశ్వరరావు (24) తల్లిదండ్రులు ఇటీవల చనిపోయారు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసైన అతడు జీవితంపై విరక్తి చెంది, బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎం.సూర్యభగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.